



# లౌకికుడు

రమణయ్య లౌక్యుడు. మాంచి వ్యవహార దక్షత వున్నవాడు. అందువల్లనే కిష్టప్ప చెప్పిన మాటల్ని వెంటనే నమ్మలేకపోయాడు. అంతేకాదు – 'యీ దొంగముండాకొడుకు డబ్బు కోసం వుబ్బేయడం లేదుగదా!' అని కూడా అనుకున్నాడు.

సన్నగా చిటికిన వేలు లావు చుట్టిన చేబోలు పుగాకు చుట్టను పక్కగా పళ్ళ సందున యిరికించి, ముట్టించేందుకు అగ్గిపుల్ల గీసేవాడల్లా ఆగి కిష్టప్ప మొహంలోకి సాలోచనగా చూశాడు.

గోడకు బాగా వీపు దబాయించి కూర్చున్న కిష్టప్ప బీడీని ఆఖరిసారిగా ఓ గట్టి పట్టుపట్టి

పీకను దూరంగా విసరేస్తూ, "అయ్యగారికి నే చెప్పిందాంటో నమ్మకం కుదరనట్టుంది!" అన్నాడు.

రమణయ్య చప్పున గుర్తొచ్చినవాడిలా అగ్గిపుల్ల గీసి చుట్ట ముట్టిస్తూ, "ఉహు! ఉహు!" అని నసిగాడు.

"రాజావారు వదిలేవారే కాదు బాబూ! కాని ఆ దాసీ ముండాకొడుకు తిన్నింటి వాసాలు లెక్కపెట్టడంతో..."

రమణయ్య గట్టిగా నేలను కాలితో తన్ని తలని తీవ్రంగా పంకించడంతో కిష్టప్ప నాలుక కొరుక్కుని, బారచాపిన కాళ్లని చప్పున ముడుచుకున్నాడు.

"గొప్పవాళ్ళ సంగతులు మన గొంతుకు మీదికి తెస్తయ్! దాసీవాడేం చేస్తాడు. గుర్రాల మీద చూపిన మోజులో సగం రాణీగారి మీద చూపితే యింత చిక్కొచ్చేదిగాదు"

కిష్టప్ప, రమణయ్య మాటలు విని వూరుకున్నాడు. రెండు మూడు నిమిషాలు గది నిశ్శబ్దంగా వుండిపోయింది. తమకేమీ సంబంధంలేని ఓ ప్రమాదకరమైన విషయాన్ని చర్చించామనే భావం యిద్దరిలోనూ కొంత భయాన్ని కలిగించింది.

"కిష్టప్పా! యింతకీ రాజాగారు పూర్తిగా రావడం మానుకున్నట్టేనా?"

కిష్టప్ప కొంచెం వులిక్కి పడ్డాడు. రమణయ్య మొహం కేసి చూసి కొంత కుదటపడి స్వరం స్థాయి తగ్గించి అన్నాడు.

"అదేబాబు చెప్తా! ఆ దాసీవాడి గోలతో రాజావారు రాణీగారిని బాగా ఏలుకుంటున్నారు. శిఖామణి నాకు అబద్ధం చెప్పదు. రెండు నెలలై ఎన్ని కబుర్లు చేసినా జవాబే లేదు. పిచ్చిదైపోయే స్థితిలో మీరు...."

"నిజంగానా కిష్టప్పా? నిజంగానా?"

"అబద్ధం ఎందుకు చెప్పాలి బాబూ! నేనూ అంతో ఇంతో చదువుకున్నవాణ్నే! మూర్ఖుణ్ని కాను.. మీరే గనక ఆ రోజున సైకిలు మీద పోతూ కంటబడకపోయినట్టయితే యీపాటికి ఏమైపోయేదో ఆ దేవుడికే ఎరుక!"

రమణయ్య వొళ్లు పులకరించినట్టయింది. జుట్టు ముడి విప్పి, ఎడంచేత్తో ముచ్చిడిగుంట దగ్గిర గట్టిగా పట్టుకుని కుడిచేత్తో వెంట్రుకల్ని గాలిలోకి రెండుమార్లు బాగా వూపి సున్నితంగా నాజూగ్గా మళ్లీ ముడేసుకున్నాడు.

"యింతకీ నన్ను ప్రేమించిందంటావా?" – తన్మయతలో, పెదాల మీద మెల్లిగా తచ్చాడుతూన్న చిన్న నవ్వుతో ప్రశ్నించాడు.

కిష్టప్ప బనీను జేబులోంచి బీడీ లాగి. రెండువైపులా గట్టిగా వూది, రమణయ్య మొహంలోకి పరీక్షగా చూస్తూ, అగ్గిపెట్టె కోసం చేయి చాచాడు.

"చెప్పు కిష్టప్పా? నిజంగా... నన్ను....ఆc!" అంటూ రమణయ్య అగ్గిపెట్టె అందించాడు.

"నిజం బాబూ! నిజం. మీరోమాటు అటొస్తే మీకే తెలిసిపోతుంది"

అగ్గిపుల్ల గీసి బీడీ ముట్టిస్తూనే, పళ్ళసందు నుంచి కిష్టప్ప జవాబిచ్చాడు.

రమణయ్య యాజీచైరులో బాగా వెనక్కి నడుం విరుచుకుని. ముందున్న ముక్కాలిపీట మీద రెండు కాళ్ళనీ వేసి, యింటి నడికప్పులోకి చూస్తూ పొగచూరి బూజు పట్టిన వాసాల్ని లెక్కపెట్ట సాగాడు.

కిష్టప్ప తృప్తిగా గోడకు వీపు అదిమిపట్టి, బీడీని బలంగా రెండుమార్లు పీల్చి సన్నగా పొగ వదుల్తూ, ఓ చిన్న కునుకు తీయబోయాడు.

"వంటయింది. మడి కట్టుకోవొచ్చు"

రమణయ్య వాసాల లెక్కని సగంలో ఆపి కి(్రుమంటూ, కుర్చీ ముందుకు వచ్చాడు.

కిష్టప్ప కునుకు మధ్యలో వులిక్కిపడి, ముందుకు ఆనుకుంటూ తల వెనక గోడకి ఢీకించి, పొగ వొదలబోయి మింగి వుక్కిరిబిక్కిరయ్యాడు.

"సరే లేవోయ్ కిష్టప్పా! కాదనేదేముంది. సాయంకాలం పొలాన కనబడు. గోగుల మాన్యం దగ్గర వుంటాను"

రమణయ్య మాట పూర్తిచేస్తూనే నడవాలోకి వెళ్ళిపోయాడు. కిష్టప్ప ఆరిపోయిన బీడిని గుప్పెట్లో దాస్తూ –

"సునీతమ్మగారూ! నోరు చవి చచ్చింది. యింత దబ్బకాయ పచ్చడిగానీ వుసిరికాయ పచ్చడి గానీ..." అంటూ రమణయ్య భార్య వైపుకు తిరిగి నాలుక చప్పరించాడు.

"యిప్పుడు కాదు కిష్టప్పా. మైలతో తీయకూడదు. ఆవులెల్లుండి రా!"

"అలాగేలేండి అమ్మగారూ!"

కిష్టప్ప బయట వసారాలోకి వచ్చి నిలబడి, చాలీచాలని పంచ మడకట్టుకుని వంటగదిలోకి పోతున్న రమణయ్య భార్యను చూస్తూ భుజాలు ఎగరేసి, కళ్లు చిట్లించాడు.

'శిఖామణి అందం బలాదూర్! పాపం, పిచ్చిది!' అంటూ నిట్టూర్చాడు.

ఆ సాయంకాలం కిష్టప్ప వచ్చేప్పటికే రమణయ్య ఓ నిర్ణయానికి వచ్చాడు. చేలో గడ్డవిరిచే పని కూలీలకు పురమాయించి, దిబ్బ మీది గంగరావి చెట్టు కింద కూర్చుని అతడు ఆ నిర్ణయంలోని సాధకబాధకాల్ని ఆలోచించసాగాడు.

ఎంత రాజావారు వుంచుకుని వదిలేసిందయినా వుంపుడుకత్తె వుంపుడు కత్తే! ఓమారు ఆ మార్గాన పడితే తరవాత ఫలితాలు కొంత విషమంగా వుండొచ్చని అతనికి తోచింది.

కృష్ణమాచార్లు శశిరేఖతో రాత్రంతా శృంగారం నడుపుతూంటే, దాని తమ్ముడు భూషణం, ఆచార్ల పెళ్ళాం తాయారమ్మతో రాత్రంతా కాలం గడుపుతూంటాడు. కామయ్య పంతులూ, రామావధాన్ల సంసారాలు తీన్‌తేరా ఎందుకయినయ్యో పీరుసాయబునీ, జాకోబునీ ఎరిగున్న వాళ్ళందరికీ తెలుసు! మరి తనూ అదే మార్గాన పడితే తన సంసారం?

కిష్టప్పని అల్లంత దూరాన చూసేవరకూ, రమణయ్య యిలాంటి అనుమానాలతోనే కొట్టుమిట్టాడాడు. కాని అతడు దృష్టిలో పడంగానే శిఖామణి అపురూప సౌందర్యం, హొయలూ అతడి కళ్ళ ముందు కదుల్లాడాయి.

'సునీత అలాంటిది కాదు! తాయరమ్మా రామవధాన్ల పెళ్ళాలతో దానికి పోలికే లేదు. పండితుడి పుత్రిక. నేనంటే ఎంత భక్తీ, అణకువా...'

భార్య చేసే నోములూ, వ్రతాల్నీ, ఆమె ఎప్పుడూ చదువుతూండే పతివ్రతల కథల పుస్తకాల్నీ వూహించుకుని రమణయ్య మనసు కుదుట పడింది.

"బాబుగారు యింకా ఆలోచిస్తున్నట్లే వుంది!"

కిష్టప్ప దిబ్బ ఎక్కుతూ అన్న మాటలకి ఏమీ జవాబివ్వకుండా రమణయ్య మెల్లిగా ఆవులించి, పెద్దగా చిటికవేసి చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

"చెప్పాను బాబూ! మీరీ రాత్రికి రాందే బతకలేనంటున్నది"

రమణయ్య హఠాత్తుగా చలిజ్వరం సోకినవాడిలా, వొళ్ళు ముడుచుకున్నాడు

"అదికాదు కిష్టప్పా! అంత తొందరైతే ఎలా? కాస్త ఓర్చుకోవాలి"

"మీకు తెలీదు బాబూ! అలాంటి ఆడాళ్ళకి ఒకసారి మనసు పడిందంటే మరి వొళ్ళు తెలీకుండా ఐపోతారు. అందులో శిఖామణి అలాంటిలాంటిది కాదు. పెద్ద కులస్తురాలు. చిన్నప్పుడే మొగుడు పోతే పేరు మార్చుకుని  ఈ వృత్తిలో కొచ్చింది"

తీవ్రంగా వీచే పడమటి శాంబ్రం వేడికి పైపంచ చెవులకి చుట్టి, దూరంగా చేలో గడ్డ విరుస్తున్న కూలీల వంక ఒకమారు చూసి రమణయ్య సన్నని పొడవాటి చుట్టను ముట్టించాడు.

సూర్యుడు వేగంగా పడమర వైపుకు జారిపోతున్నాడు. దూరంగా బాడే కాలవ అవతల వుప్పు చవిటిపర్రలు పొగలు కక్కుతూ ఎండమావుల్ని సృష్టిస్తోన్నయ్.

"ఇంతకీ... ఎంతదుగుతుంది కిష్టప్పా?" - రమణయ్య గంగరావి చెట్టు మొదలు వంక చూస్తూ ప్రశ్నించాడు.

"మనసులు కలిసిన తరవాత అది మీలోమీరు అనుకోవాలి బాబూ! జమీందారుగారి తరవాత... అగ్రహారీకులు మీరే సమరిదించుకోగలరు"

రమణయ్య పళ్ళసందుగా తుపుక్కున వూసి చుట్ట నుసి రాల్పి కుడి బుజం ఎగరేసి చెవుల మీదగా చుట్టిన పైపంచని వూడతీసి ఎడం బుజం మీద వేసుకున్నాడు.

"ఇవ్వాళ కాదు. రేపు వస్తానని చెప్పు"

"ఎందుకని బాబూ? యివ్వాళే ఎందుకని రాగోడదు!" - కిష్టప్ప దీనాతిదీనంగా అదోలా మొహం పెట్టి అడిగాడు.

"రాత్రిళ్లు యింటి దగ్గర అదొక్కర్తే వుండలేదు. కాస్త తోడుగా వుండేందుకు ఎవర్నయినా చూడాలి. జీతగాడు అవసరమని చాలా రోజుల్నించి అనుకుంటున్నాడను"

"సరేబాబూ! అట్టాగే! అట్టాగే!"

చెవ్వుల మీద పడ్డ నీళ్ళని దులుపుకునేందుకు ఎడాపెడా తల వూపే కుక్కలా కిష్టప్ప తల అటూయిటూ వేగంగా వూపి, బనీను జేబులోంచి బీడీలాగి అగ్గిపెట్టె కోసం రమణయ్య వేపుకు చేయి చాపాడు.

ఆ తరవాత వాళ్ళిద్దరూ ఎక్కువగా మాట్టాడలేదు. రమణయ్య చుట్ట కాలుస్తూ పనిచేసే కూలివాళ్ళ వేపుకీ, కిష్టప్ప బీడీ పొగ వదులుతూ రమణయ్య వేపుకీ చూస్తూ వుండిపోయారు.

చీకటి పడుతూ వుండగా రమణయ్య పొలం నుంచి యింటికి బయలుదేరాడు. దారి పొడుగునా అనేక ఆలోచనలూ, భయాలూ అతడికి నడక సాగనివ్వలేదు. తను రాత్రి రాత్రంతా మరోచోట గడిపేస్తుంటే తన భార్య కూడా, కృష్ణమాచారి రామావధాన్ల పెళ్ళాల్లాగా మరెవరితోనో కాలం గడపదు కదా?

యీ అనుమానం అతణ్ని నానా యాతనా పెట్టింది. చేల గట్లూ, కాలి బాటలోని ఎగుడు దిగుళ్ళూ రమణయ్య గమనించకుండానే, తూల్తూ, మౌనంగా ఆలోచిస్తూ నడిచాడు.

ఇంటికి రాగానే భార్య వాకిట్లో ఎదురై పలకరించింది.

"యింత చీకటిపడిందాకా ఏం చేస్తున్నారు? నాకు చావిట్లోకి వెళ్ళేందుకు భయమేసింది. ఆవు పెయ్య ఒకటే అరుపు. మేత వేసిరండి!"

రమణయ్య ఆలోచనలకి అతరాయం కలిగి, యిట్టే ఏదో సూచన ప్రాయంగా వెతుకుతూన్న మార్గం కనపడినట్టయింది.

"జీతగాడ్ని పెడితే బావుండిపోను. రేపటి నుంచీ మరీ పొద్దుపోయి రావలసి వచ్చేట్టుంది!"

"మీదంతా యిదిగాని, ఒక్క పెయ్యి దూడ కోసం జీతగాడెందుకండి? రేపట్నుంచీ పొద్దుపోయే వరకూ ఏం పనులున్నయ్?"

రమణయ్య పైపంచ మంచం మీద వేసి, చొక్కా విప్పుతూ ఆలోచించాడు. తను కోరిన మార్గంలోనే సంభాషణ సాగుతూన్నట్టు తోచింది.

"రామాలయం తగూలూ – రాజీ కుదర్చకపోతే కొంప మునిగేట్టుగా వుంది. ఎందుకైనా మంచిది... పొద్దుపోయి వచ్చినా చిక్కుండదు. ఓ జీతగాడ్ని పెడితే సరిపోతుంది"

సునీతమ్మ ఏమీ మాట్లాడలేదు.

పావుగంట తరవాత వేడినీళ్ళ కాగును బయట పెట్టి, సబ్బూ తువ్వాలూ రమణయ్యకు అందిస్తూ, "సరే మీ యిష్టం! ఆ తెచ్చే జీతగాడ్ని నమ్మకమైన వాణ్ణి తేండి. అంతా దొంగవెధవ లౌతున్నారు" అంది.

రమణయ్య 'ఊఁ' కొట్టి ఊరుకున్నాడు.

భోజనాలై పడుకున్న తరవాత అతడికి మామూలుగా పట్టే మొద్దు నిదర పట్టలేదుగదా, కనీసం కళ్లు మూసేందుకు కూడా యిష్టం కలగలేదు.

అతడు తీసుకోబోయే నిర్ణయంలోని సాధకబాధకాల్ని అన్ని కోణాల్నుంచీ ఆలోచించాడు. డబ్బుని మంచినీళ్ళ ప్రాయంగా వాడి, పడిగాపులు కాసినా అందని శిఖామణి – తనకు తానై వలచి కబురు చేసినప్పుడు కాదని వూరుకోవడం అదృష్టదేవతకి కాలు అడ్డుపెట్టడం లాంటిదే! పోతే వచ్చిన చిక్కల్లా సునీతిని గురించి. తను రాత్రిళ్లు యింటి దగ్గర లేకపోతే – ఎంత సాంప్రదాయాల్లో పెరిగి. నీతినియమాలూ, పతి శక్తి కలిగినదైనా – ఏ సందర్భంలోనో యిట్టే కాలుజారొచ్చు.

జీతగాడన్న తరవాత కొంత చనువు ఏర్పడక తప్పదు. వాడే ఏదో అవకాశం చిక్కించుకొనేందుకు ప్రయత్నించవచ్చు.

బాగా కోడికూసే వేళకు ఓ తిరుగులేని నిరపాయకరమైన నిర్ణయానికి అతడు రాగలిగాడు. చెప్పులు కుట్టే రామిగాడి మూడో కొడుకు నాగడు అన్ని విధాలా తగినవాడుగా అతడికి కనపడ్డాడు. వాడైతే గొడ్లచావిడి దాటి యివతలికి రాలేదు. సునీతి కూడా వాడికి పది గజాల కన్న దగ్గిరకి వెళ్ళలేదు.

మరుసటి రోజు వుదయం భోజనం వేళకి నాగడిని వెంటబెట్టుకొచ్చిన రమణయ్యను చూసి, సునీతి నిశ్చేష్టురాలైంది. కలా - నిజమా అన్నంతగా కలవరపడింది.

"యీ ఆచారం నే నెక్కడా చూడలేదు. ఎవరైనా శూద్రుణ్ణి జీతగాడిగా పెట్టుకుంటారు గాని - యీ విధంగా... అయ్యో! అయ్యో!" అని నెత్తీనోరూ బాదుకుంది.

"వాడు చావిట్లో పడుంటాడు. మన ఆచారాని కేమీ భంగంరాదు. యింత కన్నా నమ్మకమైన వాడు ఎవరూ దొరకలేదు"

రమణయ్య తల వేలాడవేసి, బతిమాలుతూన్న ధోరణిలో భార్య కళ్ళల్లోకి చూశాడు.

"ఆవుపెయ్యకు గావు దగ్గర నీళ్లు పెట్టవలసి వస్తుందిగదా! మరి అక్కడే బాదం చెట్టూ, తులసి మొక్కా........"

రమణయ్య గుడ్లు తేలవేసి, అంతలో పుంజుకుని అన్నాడు.

"నీకు అంత మైల సోకుతుందనుకుంటే - యింత ఆవు పంచితం చల్లితే సరిపోతుంది. ఆవు పంచితం సర్వకల్మషహతమని నీకు తెలియంది కాదు"

సునీతి భర్త మొహంలోకి చూసి తృప్తిగా నవ్వింది.

"నేను ఎరిగుండే, మర్చిపోయే విషయాన్ని మీరు అప్పుడప్పుడు యిలా గుర్తుచేస్తూంటారు"

తరువాత జరిగిన అన్ని విషయాల్ని విపులంగా చెప్పాలంటే - విసుక్కూడా కలగవచ్చు గనక యిక చెప్పదలుచుకున్నదంతా కథారూపంలోనే వుంటుంది.

రోజులూ, వారాలూ, నెలలూ గడిచినై. నాగడు రాత్రింబళ్లు అక్కడే వుంటున్నాడు. రమణయ్య రాత్రిళ్ళు పూర్తిగా శిఖామణి యింట్లో గడిపేస్తున్నాడు.

"నాగడు మీద వేసుకు తిరిగే గొంగళి చూస్తే నాకు అరికాలి మంట నెత్తికెక్కుతుంది"

"వాడెలా చస్తే మనకేం వాళ్ళ తరహా అది" - రమణయ్య భార్యకు సర్దిచెప్పాడు.

✪ ✪ ✪

"మనిషి మోటు ముండాకొడుకుగా కనబడుతాడుగాని, మనస్సు మంచిదండీ"

"ఆఁ!" - రమణయ్య నాలుక కొరుక్కున్నాడు.

"పాపం! పండక్కి ఓ జత ఇరవై నంబరు పంచెలన్నా తెచ్చిపెట్టండి"

"ఊఁ!" - రమణయ్య పెదాల కరుచుకున్నాడు.

ఆ రాత్రి ఒంటి గంటకు శిఖామణి నిండు నిదరలో వుండగా. రమణయ్య దీర్ఘాలోచనలో

మునకలు వేస్తున్నాడు. హఠాత్తుగా తలుపు ఎవరో గట్టిగా తట్టారు. దుప్పటి మీద వేసుకుని విసుగ్గా తలుపు తెరిచాడు.

"ఎవరు నువ్వు? ఏం పని?"

"కోటకముండేలుని! రాజావారు వస్తున్నారు. నువ్వెవరపు?"

"నేనా....నేను! హుం! అగ్రహారపు రమ........."

ఫెడేలుమని తలను రాసుకుంటూ జారి భుజాన పడిన లాఠీ దెబ్బతో రమణయ్య కంపించిపోయి, వాకిట్లో ముందుకు పడి – చావు బలంతో లేచి పరుగెత్తాడు.

తన యిల్లు యింకా ఫర్లాంగు వుందనగా వేగం తగ్గించి కట్టు పంచెతో మొహం తుడుచుకుని, మెల్లిగా వాకిలి దగ్గరకు వెళ్ళి తలుపు జాగర్తగా కొట్టాడు.

నాలుక ఎండిపోతుంది. దాహం, దాహం! అదే అతడి ఆలోచన!

తలుపు అతడి చేతి తాకిడికి వెనక్కి పోయింది. భయంతో పరుగెత్తినందు వల్ల కలిగిన ఆయాసంతో దాహం వల్ల లాక్కుపోతూన్న నాలుకతో వ్యధపడుతూన్న రమణయ్యకి అదేమీ ఆశ్చర్యం కలిగించలేదు.

తలుపు మరికొంచెం నెట్టుకుని లోపల అడుగు పెట్టగానే కనబడిన దృశ్యం అతణ్ణి నిలువునా కుంగదీసింది.

పట్టెమంచం మీద గొంగళీ. కింద ముక్కాలి పీట మీద వెండిపళ్ళెం, వెండిగ్లాసూ.......

రమణయ్య హృదయం భగ్గుమంది. గొంతు ఎండిపోతోంది.

అతడు నిప్పులు చెరిగే కళ్ళతో నిశ్శబ్దంగా వెళ్ళి వెండిగ్లాసులోకి చూచాడు.

గ్లాసులో ఓ నీటి బిందువు కూడా లేదు.

వణుకుతూన్న చేతుల్తో గ్లాసు అందుకొని రమణయ్య చుట్టూ చూశాడు. గడప పక్కగా విసనకర్ర మూత పెట్టబడిన పెద్ద చెంబు అతడి దృష్టికి అమృతభాండంలా కనబడింది.

ఐక్క అంగలో విసనకర్ర అందుకుని అవతల పడవేసి, చెంబు ఎత్తి గ్లాసులో పోసుకుని, ఆత్రంగా నోటి దగ్గరకు పోనిచ్చాడు.

ఆశ్చర్యం, జుగుప్సా, భయం, ద్వేషం అతణ్ణి చుట్టుముట్టినై. భరించలేనంత వాసన!

ఆవు పంచితం!

వెండి గ్లాసును విసిరికొట్టి ఓ క్షణం తనలోని అన్ని వుద్రేకాలనీ తొక్కిపెట్టి తల పంకించి నిబ్బరంగా ముక్కాలిపీట మీద వున్న వెండిపళ్ళెం చేతిలోకి తీసుకుని చావిడి వేపుకు విసిరేస్తూ అతడు పెద్దంగా అరిచాడు –

"దొంగలు! దొంగలు!"

రమణయ్య లౌక్యుడు! మంచి వ్యవహారదక్షత వున్నవాడు!

✪

*(రేరాజు మాసపత్రిక : 1940–49 మధ్య)*